క్లుప్తంగా

విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ క్లస్టర్ పరిధిలోని వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాల్లో గురువారం రైతులకు విత్తన శుద్ధి, విత్తన గుళికలు తయారు చేసుకునే విధానం గురించి ప్రకృతి వ్యవసాయం ఎస్‌డీపీ అన్నామణి వివరించారు. ఆమె మాట్లాడుతూ కందులు, మినుములు, జొన్న, మొక్కజొన్న, సజ్జలు దళసరి పొట్టు కల్గిన విత్తనాలు తీసుకొని వాటిని దళసరి గోనెసంచిలో వేసి జీవామృతం, తగినంత నీరు, ఘన జీవామృతం, బూడిదతో వాటిని కలిపి జల్లెడ పట్టి మధ్యలో జీవామృతం చల్లుతూ పొరలు ఏర్పడిన తర్వాత బూడిదను చల్లుకున్నట్టయితే ఆ విత్తనాలు శుద్ధిగా అయి విత్తన గుళికలుగా ఏర్పడుతాయని చెప్పారు. విత్తన శుద్ధిచేసిన విత్తనాలు భూమిలో నాటితే ఎటువంటి చీడ పీడలు ఆశించకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వీరలక్ష్మి, వెంకటేశ్వర్లు, పెద్దారావు, ఎంపీఈవో తేజస్విని, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏటీ రమణారెడ్డి ప్రీమాన్ డ్రైసోయింగ్ సిస్టం గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల ఖర్చు తక్కువ అవుతుందని, పంట అధికంగా చేతికి వస్తుందని వివరించారు. రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా ప్రకృతి పద్ధతిలో వ్యవసాయం చేయాలని సూచించారు. పప్పుజాతి, తీగజాతి, నూనె, కూరగాయలు, ఆకుకూరలు పండించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డి.రాజకుమారి, మాస్టర్ ట్రైనర్ మల్లేశ్వరి, శివ మస్తాన్‌రావు, కె.జయ, కోటేశ్వరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రూ.15 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి నగరంలోని 2వ వార్డు నీలిమా నర్సరీ రోడ్డులో రూ.15 లక్షల వ్యయంతో సీసీ రోడ్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులను ఏఈ కిషోర్ గురువారం పరిశీలించారు. ఏఈ మాట్లాడుతూ వారం రోజుల పాటు ఈ ప్రాంత ప్రజలు కార్పొరేషన్ ఇంజినీరింగ్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

రోడ్డు మార్జిన్ ఏర్పాటు

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం నుంచి కొలనుకొండ వరకు రూ.40 లక్షల వ్యయంతో ఇటీవల సీసీ రోడ్డు నిర్మించారు. రోడ్డుకు ఇరువైపులా మార్జిన్ ఏర్పాటు చేసేందుకు కార్పొరేషన్ అధికారులు గురువారం గ్రావెల్ తోలకం నిర్వహించారు. ఏఈ కిషోర్ మాట్లాడుతూ కేఎల్‌యూ నుంచి బైపాస్‌కు వెళ్లేందుకు వడ్డేశ్వరం, కొలనుకొండ ప్రజలకు అనువుగా ఉంటుందని తెలిపారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండడంతో సీసీ రోడ్డుకు ఇరువైపులా మీటరు పొడవున మార్జిన్ నిర్మించనున్నట్లు తెలిపారు.

క్యాన్సర్ బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని క్యాన్సర్ బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి గురువారం ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఎమ్మెల్యే ఆర్కే ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబాలకు దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్)లు అందజేశారు. కార్యక్రమంలో మోరంపూడి సర్పంచ్ ఇత్తడి రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పలుకూరు శామ్యూల్, కొప్పుల ప్రకాశరావు, కనపర్తి సాంబశివరావు, మొండితోక సాంబయ్య, ఇత్తడి చంటి, జమ్ముల లోకేష్ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం



కంతేరులో ఫ్యామిలీ డాక్టర్ ప్రారంభించి పరిశీలిస్తున్న కత్తెర సురేష్‌కుమార్, జేసీ రాజకుమారి



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, ఎమ్మెల్యే ఆర్కే

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి
- ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభం
- కంతేరులో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రారంభించిన కత్తెర సురేష్ కుమార్, సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి

తాడేపల్లిరూరల్: దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాదయాత్ర చేస్తున్న సమయంలో పేద ప్రజలు వైద్యం అందక ఎలా మృతి చెందుతున్నారో తెలుసుకుని అధికారంలోకి వచ్చిన అనంతరం ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి ఎంతోమందికి ప్రాణదాతగా నిలిచారని, ఆయన బాటలోనే నడుస్తున్న మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగంలో పెనుమార్పులకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. దుగ్గిరాల పీహెచ్‌సీ సబ్ సెంటర్‌లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆవిష్కరించిన ఫ్యామిలీ డాక్టర్ విధానం దేశ చరిత్రలోనే ప్రథమమని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ, 104 డిస్ట్రిక్ మేనేజర్ రాఘవ, డాక్టర్ అబ్దుల్ రెహమాన్, డాక్టర్ ఇంద్ర, దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, దుగ్గిరాల సర్పంచ్ బాణావత్ కుషీబాయి, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదవాడి చెంతకు ఆధునిక వైద్యం చేర్చేందుకే ఫ్యామిలీ డాక్టర్ విధానం

తాడికొండ: ప్రతి పేదవాడి చెంతకు ఆధునిక వైద్యం చేర్చేందుకే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్, జిల్లా సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి అన్నారు. తాడికొండ మండలం కంతేరు గ్రామంలోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో జిల్లా సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రావణ్‌బాబులతో కలిసి ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఎం ప్రారంభించిన ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించిన అనంతరం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ఆయన ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానంలో మంచానికే పరిమితమైన రోగులకు సైతం వారి గ్రామంలోని ఇంటి వద్దకు వచ్చి వైద్యం అందించడం జరుగుతుందన్నారు. గతంలో పీహెచ్‌సీలలో ఒక్కరే వైద్యులు ఉండేవారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఇద్దరు వైద్యులను అందుబాటులోకి తీసుకురావడంతోపాటు అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. వైద్య రంగంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ఆరోగ్య పరంగా ఎంతో మార్పు తెస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం అతిథులతో కలిసి రోగలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెజ్జం మహేష్‌బాబు, ఎంపీటీసీ వలపర్ల కల్పన, సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీలు బండ్ల పున్నారావు, కొమ్మినేని రామచంద్రరావు, అవుతు శ్రీనివాసరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్ట్ దాసరి రాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, సదానందరెడ్డి, కర్రి రవిపాల్, రాఘవరెడ్డి, వెంకట్రావు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిడుముక్కలలో...

తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాదాసు రత్నకుమారి, ఎంపీటీసీ బోడపాటి సుశీల, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, మాజీ ఉప సర్పంచ్ మాదాసు ఏసురత్నం, అత్తోట అక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి మెరుగైన వైద్యం ప్రభుత్వ లక్ష్యం

మేడికొండూరు: గ్రామాల్లో ప్రతి ఇంటికి మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ వీల్లేజ్ హెల్త్ క్లినిక్‌ను అందుబాటులోకి తెచ్చిందని ఎంపీపీ మన్నవ స్వప్న అన్నారు. మండలంలోని విశదల గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆమె గురువారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్య, వైద్య రంగాలకు ఎక్కువ బడ్జెట్ కేటాయించడం జరిగిందన్నారు. గ్రామస్థాయిలో స్పెషలిస్టు వైద్యుడు అందుబాటులో ఉండేలా చూసి అన్ని రకాల మందులు ఉచితంగా ఈ క్లినిక్‌లలో పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, మండల వైద్య అధికారి డాక్టర్ అనురూధ్, గ్రామ నాయకులు మామిడి సీతా రామయ్య తదితరులు పాల్గొన్నారు.

టెన్షన్...టెన్షన్

- హాల్ టికెట్ పోగొట్టుకున్న విద్యార్థి
- జర్నలిస్టులు, పోలీసుల చొరవతో అందిన హాల్ టికెట్
- ఊపిరి పీల్చుకున్న విద్యార్థి, తల్లిదండ్రులు

మంగళగిరి: ఓ విద్యార్థి పదో తరగతి పరీక్షల హాల్ టికెట్టు పోగొట్టుకున్నాడు. ఇక పరీక్ష రాయలేనన్న ఆవేదనతో టెన్షన్‌కు గురయ్యాడు. ఆ విద్యార్థి తల్లిదండ్రులు కూడా ఆందోళన చెందారు. చివరకు హాల్ టికెట్ దొరకడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆత్మకూరు జిల్లా పరిషత్ హైస్కూలులో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి కేసాని సుబ్రమణ్యం గురువారం 10వ తరగతి హిందీ పరీక్ష రాయాల్సి వుంది. తన స్నేహితుడిని డాన్‌బాస్కో స్కూలు వద్ద వదిలి తన నిడమర్రు రోడ్డులోని అరవింద స్కూలుకు బయల్దేరాడు. మార్గంమధ్యలో హాల్ టికెట్ పోగొట్టుకున్నాడు. పరీక్ష కేంద్రానికి వెళ్లిన తర్వాత చూసుకోగా హాల్ టికెట్ కనిపించలేదు. ఆందోళన పడుతూ తల్లిదండ్రులకు సమాచార మివ్వడంతో అందరూ హాల్ టికెట్ కోసం వెతుకులాట ప్రారంభించారు. ఇంతలో డాన్‌బాస్కో స్కూలు వద్ద విధులలో ఉన్న కానిస్టేబుల్‌కు ఓ వ్యక్తి హాల్ టికెట్ అందించాడు. అప్పుడే పరీక్ష కేంద్రానికి తన కుమార్తెను దింపేందుకు వెళ్లిన జర్నలిస్టుకు కానిస్టేబుల్ హాల్ టికెట్ ఇచ్చాడు. ఆయన హాల్ టికెట్‌ను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వెంటనే స్పందించిన జర్నలిస్టులు ఎంఈవోతోపాటు విద్యార్థి చదివిన పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సమాచార మిచ్చారు. వెంటనే స్పందించిన అధికారులు విద్యార్థి పరీక్ష కేంద్రం ఆచూకీ కనుగొని విద్యార్థికి హాల్ టికెట్ అందజేశారు. చివర నిముషంలో విద్యార్థి కేంద్రానికి వెళ్లి పరీక్ష రాయడంతో విద్యార్థి, తల్లిదండ్రులతో పాటు అంతా ఊపిరి పీల్చుకున్నారు.



విద్యార్థికి హాల్ టికెట్ అందజేస్తున్న పోలీసులు

ఆత్మీయ స్వాగతం

పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి.



ఫుట్ బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన



ఫుట్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ చైర్మన్ చల్లా రాజేంద్ర ప్రసాద్

తాడేపల్లిరూరల్: బకింగ్‌హామ్ కెనాల్‌పై కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ వారి సహకారంతో దుగ్గిరాల మార్కెట్ యార్డు వద్ద, మంచికలపూడి వద్ద రూ.70 లక్షల వ్యయంతో నిర్మించే ఫుట్ బ్రిడ్జిల నిర్మాణానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి అతిథులుగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ చైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్‌లు హాజరయ్యారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ చల్లా రాజేంద్రప్రసాద్‌ను నాలుగు నెలల కిందట కలసి ప్రజలు, విద్యార్థులు పడుతున్న కష్టాన్ని వివరించి, ఆ రెండు ప్రాంతాల్లో ఫుట్ బ్రిడ్జిలు నిర్మించాలని కోరగా వెంటనే ఆయన స్పందించి సిబ్బందితో, ఇరిగేషన్ అధికారులతో సర్వే చేయించి ఫుట్ బ్రిడ్జి నిర్మాణానికి ముందుకు వచ్చారని తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని కాలువలకు తిరిగి నీరు వదిలేలోపుల పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంచికలపూడి వద్ద నిర్మించే బ్రిడ్జి వల్ల ఎంతోమంది రైతులు తమ పంటలను ఈ బ్రిడ్జి మీద నుండి ఆటోల ద్వారా తరలించే విధంగా నిర్మాణం జరుగుతుందని అన్నారు. ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యులు మేకతోటి అరుణ, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజీ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్‌ను జయప్రదం చేయాలి



సన్నాహక ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

మంగళగిరి: నగరంలోని ఈనెల 8వ తేదీ శనివారం నిర్వహించనున్న రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీని జయప్రదం చేయాలని పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి తిమోతి కోరారు. గురువారం నగర పరిధిలోని నవులూరులో రన్ ఫర్ జీసస్ సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. పాస్టర్ తిమోతి మాట్లాడుతూ శనివారం ఉదయం 5.30 గంటలకు నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్దకు అందరూ చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొంటారని, అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి బయలుదేరే శాంతి ర్యాలీ మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకుని ముగుస్తుందన్నారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ నిర్వహించే శాంతి ర్యాలీలో అన్ని చర్చిలకు సంబంధించిన సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు కెకె రవికుమార్, ఏపీఎస్ మణి, కె కరుణానిధి, విజయరాజు, శ్యామ్, జగదీష్, సీమోను, నాగయ్యపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

బోరుపాలెం(తాడికొండ): తుళ్లూరు మండలం బోరుపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.5 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు గురువారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ శంకుస్థాపన చేశారు. అనంతరం నూతనంగా కేటాయించబడి డ్వాక్రా సంఘంతో నిర్వహించనున్న రేషన్ దుకాణాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మాదల మహేంద్ర, స్థానిక నాయకులు తురకా శ్రీనివాసరావు, కొప్పుల శేషగిరిరావు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత



చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి: నగరంలోని చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అండగా నిలిచారు. ఇందులో భాగంగా గురువారం ఐదుగురు చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేశారు. నగరంలోని ఆటోనగర్ ఎమ్మెల్యే కార్యాలయం వద్ద చిరు వ్యాపారులు దేవరకోట వాసు, రేమళ్ల వెంకటరమణ, షేక్ చాందిని, రాఘవరపు కోటేశ్వరరావు, వంగర నరసమ్మలకు వైఎస్సార్ సీపీ నాయకులు తోపుడు బండ్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ విభాగం అధ్యక్షురాలు సంకె సునీత, మహిళా కార్యదర్శి మల్లవరపు సుధారాణి, నాయకులు ఆకురాతి రాజేష్, ఎండీ ఫిరోజ్, సంకా బాలాజీగుప్తా, కురగంటి ఆదాం, వల్లంశెట్టి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో కంటి పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అనూష

మంగళగిరి: నగర పరిధిలోని గణపతినగర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఎన్‌సీడీ క్లినిక్ ద్వారా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 44 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కంటిలో శుక్లాలు ఉన్న ఐదుగురిని, కళ్లజోళ్లు అవసరమైన పది మందిని గుర్తించి వారికి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించి ప్రభుత్వం రూ.1500 చెల్లిస్తుందని హెల్త్ సెంటర్ మెడికల్ అధికారి డాక్టర్ అనూష తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

విజయదుర్గా ఆలయంలో అఖండస్థాపన

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని విజయదుర్గా ఆలయంలో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఉదయం విఘ్నేశ్వరపూజ నిర్వహించి అఖండస్థాపన చేశారు. మండపంలో వేదపండితులు పుణ్యాహవచనం, రక్షాసూత్రధారణ, నవగ్రహ అష్టదిక్పాలక సహిత చండీ, దుర్గా అమ్మవారి ప్రధాన కలశానికి పూజలు చేశారు. ఆలయ అర్చకులు రాజేంద్రశర్మ విజయదుర్గామాతకు మంగళస్నానం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం యాగశాలలో గణపతి, రుద్రహోమం, మండప ఆవాహిత దేవతా హోమాలు వేదపండితులు నిర్వహించారు. గీతా భజనమండలి ఆధ్వర్యంలో లలితా సహస్రనామ స్తోత్రపారాయణ చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్లు నిర్మించాలి

తాడికొండ: ప్రయాణికుల సౌకర్యార్థం తాడికొండ ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్లు నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు కోరారు. ఇక్కడ నుంచి ప్రతినిత్యం వందలాది మంది ప్రయాణికులు బస్సులలో వెళుతుంటారని, మహిళలు కనీసం మల, మూత్ర విసర్జన చేసుకునేందుకు మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆర్టీసీ అధికారులు స్పందించి వెంటనే మరుగుదొడ్లు నిర్మించాలని కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మండెపూడి మృతి

మంగళగిరి: నగర పరిధిలోని నిడమర్రుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మండెపూడి పురుషోత్తం (85) గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం సాయంత్రం ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పురుషోత్తం పెద్ద కుమారుడు పానకాలరావు శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయ ఈఓగా పనిచేశారు. పురుషోత్తం మృతదేహాన్ని నివాసానికి తరలించగా గురువారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, వైఎస్సార్ సీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, ఈదులమూడి డేవిడ్ రాజు, ఈపూరి ఆదాంతోపాటు పలువురు పార్టీ నాయకులు, దళిత, ప్రజాసంఘాల నాయకులు పురుషోత్తం భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

30లోపు ఐదుశాతం రాయితీతో పన్నులు చెల్లించండి

మంగళగిరి: నగర వాసులు తమ ఇంటి, నీటి, ఖాళీ స్థలాల పన్నులను ఈనెల 30వ తేదీ లోపు 5 శాతం రాయితీతో చెల్లించవచ్చని నగర కమిషనర్ యు శారదాదేవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదావకాశాన్ని నగర వాసులు వినియోగించుకుని నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

నటరత్నాలు పోస్టర్ ఆవిష్కరించిన ఎంపీ



నటరత్నాలు పబ్లిసిటీ పోస్టర్, మోషన్ టైటిల్ ఆవిష్కరిస్తున్న ఎంపీ సురేష్

ఉద్దండరాయునిపాలెం(తాడికొండ): నటరత్నాలు మూవీ పబ్లిసిటీ పోస్టర్, మోషన్ టైటిల్‌ను గురువారం బాపట్ల ఎంపీ నందిగం సురేష్ ఆవిష్కరించారు. ఎవరెస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డాక్టర్ దివ్య, ఎలమాటి చంటి, ఆనందాసు శ్రీమణికంఠలు నిర్మాతలుగా నర్రా శివనాగు దర్శకత్వంలో నిర్మించిన చిత్రం నటరత్నాలు క్రైమ్, కామెడి, మర్డర్, మిస్టరీ నేపథ్యంలో వస్తుందన్నారు. ఈ చిత్రంలో బిగ్ బాస్ బ్యూటీ ఇనయా సుల్తానా, కామెడి కింగ్స్ రంగస్థలం మహేష్, సుదర్శన్‌రెడ్డి, తాగుబోతు రమేష్, సుమన్ శెట్టి అర్చనలు ప్రధాన పాత్రలు పోషించినట్లు చిత్ర బృందం తెలిపారు.

గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలు



ఫిరంగిపురం: ప్రతి ఒక్కరికీ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్ అన్నారు. మండలంలోని అమీనాబాద్‌లో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్లినిక్‌ను ఎంపీపీ షేక్ షహేలానర్గీస్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు ఆయా గ్రామాల్లోనే మెరుగైన వైద్యసేవలు అందేలా ఉండేందుకు ఏర్పాటుచేసినదే ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ అని, దీనిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని చెప్పారు. గ్రామాల్లో అనేక రకాల వ్యాధులకు నిపుణులైన ఆరోగ్యసిబ్బంది వైద్యపరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని ఏర్పాటుచేసిన తెరపై గ్రామస్తులకు చూపించారు. ఎంపీటీసీ సభ్యులు ఎ.అనూరాధ, గాంధీ బుడే, కార్యదర్శులు ఏకే బాబు, మధు, వైద్యాధికారులు ఫరీనా బేగం, సీహెచ్ యానీగ్రేస్, సీహెచ్‌వో వెంకటలక్ష్మి, ఎంపీహెచ్‌ఈవో టి.లూర్దు రాజు, హెచ్‌వీ నూర్‌ఖాజాబీ, హెచ్‌ఎస్ గోవిందయ్య పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఫ్లైయింగ్ స్క్వాడ్

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను తెనాలి ఉప విద్యాశాఖాధికారి ఎం.నిర్మల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని ఐదు కేంద్రాలలో 10వ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నారని, మొత్తం 714 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 709 మంది హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఈమని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాస్, డీఓ కోటేశ్వరరావు పాల్గొన్నారు.